సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం ၊ 7 ၊ ఫిబ్రవరి ၊ 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన అపర్ణ సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



క్లినికల్ ల్యాబ్‌కు రూ.లక్ష విరాళం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): బాదం బాల కృష్ణ క్లినికల్ ల్యాబ్ నిర్మాణానికి సిద్ధివినాయక ట్రాన్స్‌పోర్ట్ అధినేత ఎస్‌కే అహ్మద్ (కాకినాడ) సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు.

డెల్టాలకు 6,895 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 6,895 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు 2,030, సెంట్రల్ 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రతి ఒక్కరూ విధిగా ఆధార్ నవీకరణ చేసుకోవాలని కలెక్టర్ కె.మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత పదేళ్లలో ఎటువంటి బయోమెట్రిక్ నవీకరణ చేసుకోని వారికి మార్చి 31 వరకూ ఉచితంగా బయోమెట్రిక్ నవీకరణ చేస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మంగళవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆధార్‌కు మొబైల్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ అనుసంధానం, పేరు, పుట్టిన తేదీ మార్పు, జెండర్ మార్పు, ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్, చిరునామా మార్పుల కోసం రూ.50, మూడు అంతకంటే ఎక్కువ సేవల కోసం రూ.100 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. కొత్తగా ఆధార్ నమోదు ఉచితంగా చేస్తామని తెలిపారు. బయోమెట్రిక్ (ఫొటో, ఐరిస్, ఫింగర్ ప్రింట్) అప్‌డేట్, ఆధార్ డౌన్‌లోడ్‌కు రూ.100 చొప్పున చెల్లించాలన్నారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్‌కు ఎంపిక



ప్రసన్న భార్గవి

బిక్కవోలు: స్థానిక హైస్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న బూడి ప్రసన్న భార్గవి జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు ఎంపికై ంది. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకూ ప్రకాశం జిల్లా చెవ్వూరులో జరిగిన పోటీల్లో ఆమెను ఎంపిక చేశారని పాఠశాల హెచ్‌ఎం జి.పైడిరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకూ తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో జరిగే జాతీయ పోటీల్లో భార్గవి పాల్గొంటుందన్నారు. ఆమెను పీడీ నాగమణి, పీఈటీ నరేంద్ర, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పన వీర్రాజు, కార్యదర్శి ముప్పన స్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శి వీకేఆర్ తంబి తదితరులు అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతికి ఊరట



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య అశోక్

రాజానగరం: ఆదాయపు పన్ను మినహాయింపులు ఇవ్వడం ద్వారా మధ్యతరగతి వర్గాలకు కేంద్ర బడ్జెట్‌లో కొంత ఊరట కల్పించారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. వర్సిటీలో కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగం ఆధ్వర్యాన 'కేంద్ర బడ్జెట్ 2023–24'పై సోమవారం విశ్లేషణ జరిగింది. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి వర్గాల వారికి ఈ బడ్జెట్ ఎంతో ఆశాజనకంగా ఉందన్నారు. రీసోర్స్ పర్సన్లు కర్రి భాస్కరరెడ్డి, ఎస్.మణికంఠ రెడ్డి మాట్లాడుతూ, వివిధ రంగాలపై బడ్జెట్ ప్రభావం ఏవిధంగా ఉంటుందో వివరించారు. డాక్టర్ టి.అనితకుమారి, డాక్టర్ పి.లక్ష్మీనారాయణ, డాక్టర్ పీపీ నాయుడు, డాక్టర్ ఎ.లావణ్యకుమారి తదితరులు కూడా ప్రసంగించారు.

7న నూతన భవనాల ప్రారంభం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన కాలేజీ ఆఫ్ ఫార్మసీ, వుమెన్స్ హాస్టల్ భవనాలను ఈ నెల 7న ప్రారంభించనున్నారు. ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు ఈ విషయం సోమవారం తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అధ్యక్షతన విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ భవనాలను ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో మంత్రులు దాడిశెట్టి రామలింగేశ్వరరావు (రాజా), తానేటి వనిత, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, యాప్సీ చైర్మన్ ఆచార్య కె.మహేంద్రరెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తదితరులు పాల్గొంటారని వివరించారు.

9న జాబ్‌మేళా

అమలాపురం రూరల్: పట్టణ పరిసరాల్లోని ప్రైవేటు కంపెనీల్లో పని చేయడానికి బీటెక్, డిప్లొమా, ఈసీఈ, మెకానికల్ అభ్యర్థులకు అమలాపురం ఉపాధి కార్యాలయం వద్ద ఈ నెల 9 ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి వసంతలక్ష్మి సోమవారం తెలిపారు. వివరాలకు 96422 55545 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

భూ వివాదాలకు చెక్

- రీ సర్వేతో శాశ్వత పరిష్కారం
- విజయవంతంగా తొలి దశ పూర్తి.. శాశ్వత హక్కు పత్రాల అందజేత
- రెండో విడత 17 గ్రామాల్లో ప్రారంభమైన ప్రక్రియ
- సర్వే లక్ష్యం 47,189 ఎకరాలు
- ఇప్పటికే 22,223 ఎకరాల్లో పూర్తి
- మార్చి 10 నాటికి పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు



రీసర్వే ప్రక్రియలో సలహాలు ఇస్తున్న జేసీ తేజ్‌భరత్

సాక్షి, రాజమహేంద్రవరం: భూ వివాదాల శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 'వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష' పథకం కింద మూడు దశల్లో భూముల సమగ్ర సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. తద్వారా భూ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా తొలి దశ సర్వే ప్రక్రియను అధికార యంత్రాంగం చేపట్టింది. అప్పట్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి, శాశ్వత భూహక్కు పత్రాలు సైతం పంపిణీ చేసింది. ప్రస్తుతం రెండో దశ సర్వే జిల్లాలో యుద్ధ ప్రాతిపదికన జరుగుతోంది.

రెండో దశ 50 శాతం పూర్తి

జిల్లా వ్యాప్తంగా 272 గ్రామాల పరిధిలోని 16,52,706 ఎకరాల్లో వివిధ దశల్లో రీసర్వే చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. తొలి దశలో 44 గ్రామాల్లోని 64,336 ఎకరాల్లో సర్వే పూర్తి చేశారు. రెండో దశలో జిల్లా వ్యాప్తంగా 17 గ్రామాలను ఎంపిక చేశారు. మొత్తం 47,189.2 ఎకరాల రీసర్వేకు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే 10 గ్రామాల్లోని 22,223.91 ఎకరాల్లో సర్వే పూర్తి చేసి, సుమారు 50 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. మిగిలిన 7 గ్రామాల పరిధిలోని 24,965.78 ఎకరాల్లో సైతం త్వరితగతిన పూర్తి చేయనున్నారు. ఈ నెలాఖరుకు లక్ష్యాన్ని అధిగమించాల్సి ఉండగా.. కొన్ని సమస్యల కారణంగా మార్చి 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు.

పకడ్బందీగా..

రెండో దశ రీసర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భూములు, నివాస గృహాలు, వీధులు, ప్రైవేటు భూములు, పరిశ్రమలు.. ఇలా గ్రామానికి చెందిన మొత్తం విస్తీర్ణాన్ని సర్వే చేస్తున్నారు. తొలుత గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలిడేషన్ పూర్తి చేస్తున్నారు. సర్వే చేస్తున్న గ్రామానికి పొరుగున ఉన్న వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్ల సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రతి గట్టూ తిరిగి సరిహద్దులు నిర్ధారిస్తున్నారు. ఫలితంగా సమయం అవుతోంది.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం

రీసర్వేలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. కంటిన్యూస్ ఆపరేటింగ్ రిఫరింగ్ స్టేషన్ నెట్‌వర్క్ సాయంతో ఈ ప్రక్రియ సాగుతోంది. చిన్న వాటి నుంచి పెద్ద పెద్ద కమతాల వరకూ ప్రతీది నమోదు చేస్తున్నారు. డ్రోన్లను రంగంలోకి దింపి సర్వేలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. మొదటి రెండు దశల్లో ఇప్పటి వరకూ 1,474.629 చదరపు కిలోమీటర్ల మేర డ్రోన్లతో సర్వే నిర్వహించారు.

హద్దు రాళ్లు

సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల పరిధిలో ఫ్రీజోన్ యాక్టివిటీస్ కింద భూముల హద్దులకు సంప్రదాయ పద్ధతిలో సున్నం మార్కింగ్ చేపట్టారు. రాళ్లను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. రెండో దశలో 15,113 రాళ్లు పాతాల్సి ఉండగా.. ఇప్పటి వరకూ 5,522 రాళ్లు పాతారు.

కొలిక్కి వస్తున్న వివాదాలు

ఈ సర్వే పుణ్యమా అని దశాబ్ద కాలం నాటి భూ వివాదాలు ఓ కొలిక్కి వస్తున్నాయి. దశాబ్దం క్రితం నిర్వహించిన సర్వేలో 5 శాతం అలవెన్సు అమలు చేశారు. అప్పట్లో చైన్లతో కొలతలు వేయడంతో అటూ ఇటూ భూ విస్తీర్ణంలో 5 శాతం సరిహద్దులు నిర్ణయించారు. ఈ క్రమంలో రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి, భూమి మీద ఉన్న విస్తీర్ణానికి తేడాలు రావడంతో కొందరు రైతులు వాగ్వాదాలకు దిగుతున్నారు. 1906లో నిర్వహించిన సర్వే ఆధారంగా ప్రస్తుతం భూ సంబంధిత లావాదేవీలు కొనసాగిస్తున్నారు. ఒకే సర్వే నంబరుపై పలుమార్లు లావాదేవీలు జరిగాయి. వారసులు పంచుకోవడం, బహుమతిగా ఇవ్వడం, క్రయవిక్రయాలు జరిగినా అందుకు అనుగుణంగా భూమి మీద సబ్ డివిజన్ జరగకపోవడంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. పత్రాల మీద లావాదేవీలు జరిగినా క్షేత్ర స్థాయిలో సర్వే చేయకుండానే నోషనల్ ఖాతాల వల్ల అనేక సమస్యలు మొదలయ్యాయి. తప్పుడు సర్వే నంబర్లతో భూములు రిజిస్ట్రేషన్ కావడం, రిజిస్ట్రేషన్ అయిన భూమికి, వాస్తవంగా భూమి మీద ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండటం, నిషేధిత భూములు రిజిస్ట్రేషన్ చేయడం వంటి కారణాలతో రెవెన్యూ సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. వీటన్నింటికీ ఈ సర్వే పరిష్కారం చూపుతోంది.

రెండో దశలో సర్వే వివరాలు..

మండలం	గ్రామాలు	సర్వే విస్తీర్ణం (ఎకరాల్లో)
గోకవరం	1	3,348.39
కడియం	1	5,023.94
రాజానగరం	9	28,144.64
రంగంపేట	6	10,672.23

ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం

రీసర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో స్వయంగా పర్యటించి, ప్రక్రియ పర్యవేక్షిస్తున్నా. ఎలాంటి లోటుపాట్లకూ తావు లేకుండా పకడ్బందీగా సర్వే చేస్తున్నాం. రెండో దశలో ఇప్పటికే 50 శాతం లక్ష్యాలను అధిగమించాం. మిగిలిన వాటిని సైతం త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. నిజమైన హక్కుదారుకు న్యాయం చేయాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నాం.

– ఎస్.తేజ్‌భరత్, జాయింట్ కలెక్టర్

లక్ష్యాలను అధిగమిస్తాం



రెండో దశ రీసర్వే ప్రక్రియ వేగంగా చేపడుతున్నాం. వివాదాల పరిష్కారానికి సలహాలు ఇస్తున్నాం. ఇప్పటికే జిల్లాలోని 22,223.91 ఎకరాల్లో పూర్తి చేశాం. మిగిలినది సైతం త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– పి.లక్ష్మణరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అధికారి

వివిధ రంగాల అభివృద్ధికి రూ.52.11 కోట్లు

లోక్‌సభలో ఎంపీ భరత్‌రామ్ ప్రశ్నకు కేంద్ర మంత్రి వివరణ



రాజమహేంద్రవరం రూరల్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద 2018 నుంచి 2021 వరకూ జిల్లాలో వివిధ రంగాలకు రూ.52.11 కోట్లు వెచ్చించామని కేంద్ర స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ అమలు, ప్రణాళిక, కార్పొరేట్ శాఖ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ తెలిపారు. సీఎస్‌ఆర్ కింద దేశంలోను, రాష్ట్రంలోను, జిల్లాలోను ఏయే పనులకు ఎంతెంత వెచ్చించారో చెప్పాలని లోక్‌సభలో వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నించారు. దీనికి కేంద్ర మంత్రి సోమవారం లిఖితపూర్వకంగా జవాబు ఇచ్చారు. 2018–19 నుంచి 2020–21 వరకూ దేశంలో వివిధ రంగాల ద్వారా రూ.70,866.38 కోట్లు, ఏపీలో రూ.2,091.9 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో రూ.52.11 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ఆగ్రో ఫారెస్ట్, పాడి పరిశ్రమ, ఆర్ట్ అండ్ కల్చరల్, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, తాగునీటి వనరులు, పారిశుద్ధ్యం, వృద్ధుల సంక్షేమం, మహిళా వసతిగృహాల నిర్మాణం, మురికివాడల్లో అభివృద్ధి పనులు, క్రీడాభివృద్ధి, వృత్తి విద్య, మహిళా స్వావలంబనకు ఈ నిధులను వెచ్చించామని తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ. 50 వేల విరాళం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన ఆర్క్యులాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేసే గంటి కామేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ. 50 వేలు విరాళంగా ఇచ్చారు. చెక్కును ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు)కు అందజేశారు.

ఆక్వాకల్చర్ ప్రోత్సహించేందుకు కృషి

- ఆక్వా జోన్‌లోకి 971.44 ఎకరాలు
- కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న 971.44 ఎకరాలను ఆక్వా జోన్‌లోకి తీసుకువచ్చేందుకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం–2020 మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్వాకల్చర్‌ను జిల్లాలో మరింతగా పెంపొందించే క్రమంలో శాస్త్రవేత్తలు, నిపుణులు, ఆక్వా రైతుల అభిప్రాయాలు తెలుసుకుని, సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించి, ఆ దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 493 మంది రైతులు 2,120 ఎకరాల్లో ఆక్వా సాగు కోసం నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరిలో 112 మందికి చెందిన 346 ఎకరాలు ఆక్వా జోన్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించి, జీవనోపాధి అవకాశాలు, ఆహార భద్రత ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్‌పై ఏటా రూ.22 వేల వరకూ సబ్సిడీ ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహిస్తోందని చెప్పారు. సమావేశంలో జిల్లా సూక్ష్మ ఇరిగేషన్ అధికారి వై.శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్‌ఈ జి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, శాస్త్రవేత్తలు ఎం.మురళీధర్, ఎం.నీరజ పాల్గొన్నారు.

10న డీఆర్‌సీ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా సమీక్షా మండలి (డీఆర్‌సీ) సమావేశం ఈ నెల 10వ తేదీన జరుగుతుందని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం తన చాంబర్‌లో ఆమె అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆ రోజు ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అధ్యక్షతన డీఆర్‌సీ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఇందులో జిల్లాకు చెందిన మంత్రి తానేటి వనిత, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, ఆయా శాఖల ద్వారా భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించిన సమగ్ర సమాచారంతో ఈ డీఆర్‌సీకి హాజరు కావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్‌డీఓలు ఎస్.మల్లిబాబు, ఎ.చైత్రవర్షిణి, సీపీఓ కె.ప్రకాశరావు, ఇరిగేషన్ ఎస్‌ఈ జి.శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి హౌసింగ్ అధికారి పరశురాం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- 'స్పందన'లో 167 అర్జీల స్వీకరణ



స్పందన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీనీ నిర్ణీత సమయంలో పరిష్కరించడంతో పాటు అపరిష్కృతంగా ఉన్న వాటిపై అర్జీదారులకు సహేతుక వివరణ ఇవ్వాలని కలెక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్‌తో కలిసి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రజల నుంచి 167 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలకు జవాబుదారీతనంతో కూడిన పరిష్కారం చూపాలని అన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలని, ఆ దిశలో ప్రత్యక్ష నగదు బదిలీ రూపంలో ఆర్థిక ప్రయోజనాలను లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా బదిలీ చేస్తారని వివరించారు. నవశకం పోర్టల్, జగనన్నకు చెబుదాం 1902 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా వచ్చే అర్జీలను పారదర్శకంగా పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ, నవశకం పోర్టల్ ద్వారా ప్రతి గ్రామ సచివాలయ కార్యదర్శి, సిబ్బంది అర్జీలను కుటుంబ సభ్యుల డేటా ఆధారంగా ఆరు దశల వివరాలతో క్రోడీకరిస్తారని చెప్పారు. వాటిని ఆయా సచివాలయాల్లోని సిబ్బంది నవశకం పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సాధారణంగా పెన్షన్ నిలుపుదల, ఇన్‌కమ్ ట్యాక్స్, కరెంట్ బిల్లులు, రేషన్ కార్డులో పేర్ల సవరణ/తొలగింపు, అధిక వ్యవసాయ భూమి కలిగి ఉండడం వంటి వివరాల వలన సంక్షేమ పథకాల లబ్ధి పొందకుండా ఉండటాన్ని గుర్తించి, నవశకం పోర్టల్ ద్వారా వాటిని సరిచేసే వీలును ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.నరసింహులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తలసేమియా కవలలకు పింఛను

నెలకు రూ.10 వేల చొప్పున మంజూరు చేసిన ప్రభుత్వం

పెరవలి: అసలే వారిది పేద కుటుంబం. రెక్కాడితేనే కానీ డొక్కాడని జీవితం. ఇటువంటి పరిస్థితుల్లో తమకు పుట్టిన ఇద్దరు పిల్లలకూ తలసేమియా వ్యాధి సోకడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. మనసున్న రాష్ట్ర ప్రభుత్వం వారి కష్టాన్ని గుర్తించింది. ఇద్దరు పిల్లలకూ చెరో రూ.10 వేల చొప్పున పింఛను మంజూరు చేసింది. వివరాలివీ.. పెరవలికి చెందిన కౌజులు శ్రీను దంపతులకు కవలలు లిఖిత, లితీష ఉన్నారు. పిల్లలు పుట్టినప్పుడు ఆ తల్లిదండ్రులు ఎంతో ఆనందించారు. కానీ ఎదిగేకొద్దీ పిల్లలు చిక్కి శల్యమైపోతూండటంతో ఆందోళన చెంది, వైద్యులకు చూపించారు. ఆ చిన్నారులు తలసేమియా బారిన పడినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. పిల్లలకు ఖరీదైన వైద్యం చేయించేందుకు అవసరమైన డబ్బు లేక నరకయాతన అనుభవించారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం పింఛను ఇస్తోందని తెలియడంతో సచివాలయాన్ని సంప్రదించారు. సంబంధిత పత్రాలు సమర్పించారు. దీంతో పిల్లలిద్దరికీ నెలకు రూ.10 వేల చొప్పున పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధి లేకుండా పోయింది. ఆ పిల్లల పింఛను మంజూరు పత్రాలను తల్లిదండ్రులకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల సమక్షంలో సచివాలయ సిబ్బంది అందజేశారు. సీఎం జగన్ పుణ్యమా అని పింఛన్ మంజూరు చేయడంతో తమకు ఎంతో మేలు జరిగిందని, తమ పిల్లలకు ఆయన ఊపిరి పోశారని, ఇటువంటి నాయకుడు మళ్లీ అధికారం చేపట్టాల్సిందిగా ఆ భగవంతుడిని వేడుకుంటున్నానని శ్రీను కన్నీటితో చెప్పాడు.



తలసేమియా బాధిత చిన్నారులకు పింఛను మంజూరు పత్రాలు అందిస్తున్న నాయకులు

లెప్రసీపై సమరం

- కుష్ఠు రహిత జిల్లా సాధనకు వైద్య, ఆరోగ్య శాఖ కార్యాచరణ
- జిల్లాలో విస్తృతంగా సర్వే
- ఇప్పటికే 95 శాతం ఇళ్లలో పూర్తి
- గ్రామాల్లో 13 వరకూ అవగాహన కార్యక్రమాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాను కుష్ఠురహితంగా మార్చడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం విస్తృత కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా గత నెల 30న ప్రారంభమైన అవగాహన కార్యక్రమాలు నెల 13వ తేదీ వరకూ జరగనున్నాయి. ప్రతి గ్రామంలో సర్పంచ్, రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి సహకారంతో వైద్య, ఆరోగ్య శాఖ గ్రామసభల ద్వారా అవగాహన కల్పిస్తోంది. ఇందులో జిల్లా వ్యాప్తంగా 618 బృందాలు పాల్గొంటున్నాయి. అనుమానితులను పరీక్షించి, సమీప ప్రభుత్వాసుపత్రులకు తీసుకువెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయిస్తారు. వాస్తవానికి 'స్పర్శ' అనే నినాదంతో జిల్లా యంత్రాంగం కుష్ఠు వ్యాధిపై సమరం సాగిస్తోంది. ఇది అంటు రోగం కాదని, సకాలంలో గుర్తించి ప్రాథమిక దశలోనే మెరుగైన చికిత్స అందిస్తే పూర్తి స్థాయిలో అదుపు చేసే అవకాశముంటుందని వైద్యులు చెబుతున్నారు. చులకనగా చూస్తారనే భయంతో కొంతమంది వ్యాధి లక్షణాలను బయటకు చెప్పడం లేదు. దీనివల్ల వ్యాధి ముదిరిపోయే ప్రమాదముంటుంది. వ్యాధి నిర్మూలనలో భాగంగా రోగులను గుర్తించి, సకాలంలో వైద్యసేవలందించడమే లక్ష్యంగా గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటింటా సర్వే చేపట్టాయి. జిల్లాలో 4.60 లక్షల కుటుంబాలున్నాయి. ఇప్పటికే 95 శాతం కుటుంబాల్లో సర్వే పూర్తయింది. ఇప్పటి వరకూ జిల్లాలో 70 కేసులను వైద్య, ఆరోగ్య శాఖ గుర్తించింది. డీఫార్మిటీ (కాళ్లు, చేతులు లేని) 740 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వపరంగా ప్రతి నెలా పింఛను అందజేస్తున్నారు.

ఇవీ లక్షణాలు

- శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు.
- మందమైన మెరిసే జిడ్డు చర్మం.. ఉబ్బెత్తుగా, బత్తాయి తొక్కలా మారడం.
- చెవులు, వీపు, ఛాతిపై నొప్పి లేని బొడిపెలు.
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం.
- ముక్కుదిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం, కాళ్లు, చేతులకు తిమ్మిర్లు.
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ లేకపోవడం.
- చేతి, కాలి వేళ్లు వంకర్లు తిరిగి, అంగవైకల్యం ఏర్పడటం.

చికిత్స విధానం

కుష్ఠు వ్యాధి మైక్రో బాక్టీరియం లెప్రె అనే బాక్టీరియా వలన వస్తుంది. ఈ క్రిములు తుమ్ములు, దగ్గు ద్వారా వ్యాప్తి చెందుతాయి. వ్యాధి లక్షణాలు కనిపించేందుకు మూడు నుంచి ఐదేళ్లు పడుతుంది. వ్యాధి లక్షణాలున్న వారికి రెండు పద్ధతుల్లో చికిత్స అందిస్తారు. శరీరంపై మూడు మచ్చలున్న వారికి ఆరు నెలల పాటు, ఐదు మచ్చలు పైబడి ఉన్న వారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలల పాటు చికిత్స అందిస్తారు. దీనిలో భాగంగా నెలకొకసారి వైద్య సిబ్బంది నేరుగా రోగుల ఇంటికి వెళ్లి మందులు అందిస్తారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు ఆ వ్యాధిపై వారికి, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నివారించే అవకాశముంది. మల్టీ డ్రగ్ థెరపీతో వ్యాధిని అరికడుతున్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఈ చికిత్సా విధానం అందుబాటులో ఉంది.



ఇంటింటికీ వెళ్లి పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

లెప్రసీ రహిత జిల్లానే లక్ష్యం



జిల్లాను కుష్ఠు రహితంగా తీర్చిదిద్దేందుకు వైద్య శాఖ పని చేస్తోంది. వైద్య, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు.

– డాక్టర్ ఎస్.వసుంధర, జిల్లా లెప్రసీ, టీబీ అధికారి, తూర్పు గోదావరి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సాయిబాబు (ఫైల్)

అంబాజీపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. కె.పెదపూడి శివారు పెచ్చెట్టివారిపాలేనికి చెందిన చుట్టుగుళ్ల సాయిబాబు (57) తన మోటారు సైకిల్‌పై అంబాజీపేట వస్తున్నాడు. స్థానిక బస్టాండ్ సమీపంలో రహదారికి అడ్డంగా నిలిపి ఉన్న లారీని సాయిబాబు తప్పించే ప్రయత్నం చేస్తుండగా తీవ్రంగా గాయపడ్డాడని స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడిని 108లో అమలాపురం తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు ప్రశాంతకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వై.సూర్యనారాయణ తెలిపారు.

యువకుడిని రక్షించిన మత్స్యకారులు


యువకుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై జానీబాషా

మామిడికుదురు: పాశర్లపూడి–బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి సోమవారం వైనతేయ గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడిని స్థానిక మత్స్యకారులు రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు. మలికిపురం మండలం గూడపల్లికి చెందిన యువకుడు నాగళ్ల సత్తిబాబు ఆత్మహత్య చేసుకోవడానికి బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకాడు. గోదావరిలో మునిగిపోతూ రక్షించండి, రక్షించండి అంటూ కేకేలు వేస్తున్న యువకుడిని సమీపంలో వేటాడుతున్న మత్స్యకారులు కొల్లు నాగకృష్ణ, రాకేష్ వర్మ, నాని రక్షించారు. బోటులో ఎక్కించుకుని అతనికి సపర్యలు చేశారు. ఆ యువకుడిని నగరం ఎస్సై షేక్ జానీబాషాకు అప్పగించారు. ప్రాణాపాయం నుంచి కాపాడిన మత్స్యకార యువకులను ఎస్సై అభినందించారు. అనారోగ్యం బాధలు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఎస్సై తెలిపారు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.


మొదటి మ్యాచ్ విజేత రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు


రెండో మ్యాచ్ గెలిచిన పెద్దాపురం శ్రీప్రకాష్ జట్టు

ఉత్సాహంగా సెమీఫైనల్స్

సాక్షి ప్రీమియర్ లీగ్ టి-20 పోటీలు


మూడో మ్యాచ్ విజేత రాజమహేంద్రవరం గైట్ జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో కాకినాడ రంగరాయ వైద్య కళాశాల క్రీడాప్రాంగణంలో సోమవారం ప్రారంభమైన సాక్షి ప్రీమియర్ లీగ్ టి-20 సెమీఫైనల్స్ ఉత్సాహంగా జరిగాయి.

- మొదటి మ్యాచ్‌లో రాజమహేంద్రవరం జీఎస్ఎల్ జట్టు టాస్ గెలుచుకుని ఫీల్డింగ్ ఎంచుకుంది. రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 145 పరుగులు చేసి 2 వికెట్లు కోల్పోయింది. బ్యాట్స్‌మెన్ అజిత్ 86, సాగర్ 51 పరుగులు సాధించారు. 146 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన జీఎస్ఎల్ జట్టు నిర్ణీత ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలిపోయింది. 54 పరుగుల తేడాతో రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది.
- రెండో మ్యాచ్‌లో జీబీఆర్ అనపర్తి, శ్రీ ప్రకాష్ పెద్దాపురం జట్లు పోటీ పడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన జీబీఆర్ నిర్ణీత 10 ఓవర్లలో 62 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీప్రకాష్ జట్టు ఒక వికెట్ నష్టానికి 64 పరుగులు సాధించి 9 వికెట్ల తేడాతో విజయం సొంతం చేసుకుంది. జట్టులోని బ్యాట్స్‌మెన్ దిలీప్ 31, సాకేత్ 15, యశస్వి 14 పరుగులు చేశారు.
- మూడో మ్యాచ్‌లో రాజమహేంద్రవరానికి చెందిన గైట్ ఇంజినీరింగ్, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 98 పరుగులు చేసింది. అజిత్ 14, మణికంఠ సాయి 11 పరుగులు చేశారు. 99 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన గైట్ జట్టు నిర్ణీత ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 100 పరుగులు సాధించి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ గణేష్, మణికంఠ చెరో 18 పరుగులు చేశారు. మ్యాచ్‌లను క్రికెట్ కోచ్ చార్లి, టోర్నమెంట్ రిఫ్రెష్‌మెంట్ స్పాన్సరర్, హరిష్ స్పోర్ట్స్ అధినేత టి.హరిష్ పర్యవేక్షించారు.

SAKSHI MEDIA GROUP
www.sakshi.com

SPL
SAKSHI PREMIER LEAGUE

గుప్త నిధుల వేటకు వచ్చి పోలీసులకు చిక్కి....

సామర్లకోట: దివంగత సిద్ధాంతి గణపతి శాస్త్రి ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని దొంగిలించడానికి ప్రయత్నం చేసిన నిందితులు పోలీసులకు చిక్కారు. గత నెల 17న దొంగతనానికి వచ్చిన నిందితులు తలుపుల తాళాలు పగుల గొట్టిన సమయంలో అలికిడి కావడంతో పరారు అయిన విషయం విదితమే. ప్రత్యేక నిఘా ఉంచి నేరం చేయడానికి ప్రయత్నం చేసిన ఏడుగురిని అరెస్టు చేసి సోమవారం కోర్టుకు పంపినట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. నిందితులలో భీమవరానికి చెందిన సిత్తిని అర్జునరావు, రౌతులపూడికి చెందిన ఎలుగుబంటి సురేష్, రాజపూడికి చెందిన బుసల బాబురావు, కందుల దొరప్రసాద్, విజయనగరానికి చెందిన పింద్రాల అప్పన్న, అసనాల గోవిందు, పశ్చిమ గోదావరి జిల్లా పత్తూరుకు చెందిన గంటా యుగంధర్ వెంకటరమణ కిషోర్‌లను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

నిర్దిష్ట ప్రణాళికతో ఉన్నత శిఖరాలకు..


విద్యార్థినులకు స్కాలర్‌షిప్పులు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నిర్దిష్ట ప్రణాళికతో విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్ఆర్) ప్రోగ్రాం కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 24 ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న 406 మంది మెరిట్ విద్యార్థినులకు మలబార్ గోల్డ్ అందించిన రూ.37.52 లక్షల స్కాలర్‌షిప్పులను ఆమె సోమవారం పంపిణీ చేశారు. స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. నాడు – నేడు ద్వారా పాఠశాలల ఆధునీకరణతో పాటు మౌలిక సౌకర్యాలను కల్పించిందన్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పరిశ్రమలు, ఇన్‌స్టిట్యూట్లు ముందుకు వస్తే పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో మరింత సమాజ అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రముఖ మానసిక వైద్యుడు, బీసీ రాయ్ అవార్డు గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకుని, సమయ పాలన పాటిస్తూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినులకు కలెక్టర్, అతిథుల చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. మలబార్ గోల్డ్ స్టోర్ హెడ్ కె.ఫెబిన్, షోరూం మేనేజర్ కె.వెంకట లక్ష్మీపతి, మార్కెటింగ్ మేనేజర్ ఎ.ప్రవీణ్‌కుమార్, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు, ఇంటర్ బోర్డ్ ఆర్‌జేడీ శారద పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన బ్యాక్‌లాగ్స్

- అర్థాంతరంగా ముగిసిన భావి ఇంజినీర్ జీవితం
- ఉరి వేసుకొని ఆత్మహత్య


దుర్గారామ్‌గోపాల్ (ఫైల్)

కాకినాడ రూరల్: నాలుగేళ్ల పాటు బీటెక్ కష్టపడి చదివినా నాలుగు సబ్జెక్టులు బ్యాక్‌లాగ్స్‌గా ఉండిపోవడం అతనిలో తీవ్ర మానసిక సంఘర్షణ దారి తీసింది. పెరిగిన మనోవేదన ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొనేలా పురిగొల్పింది. ఈ విషాద ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, సర్పవరం పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాకినాడ గుడారిగుంట శాంతనపూరి కాలనీకి చెందిన గెంగిరి దుర్గారామ్‌గోపాల్(23)ది చేపల వేట ద్వారా జీవనోపాధి సాగించే కుటుంబం. అతని తండ్రి గతంలో చనిపోగా తల్లి, అక్క, తమ్ముడు ఉన్నారు. కోరంగి వద్ద గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో దుర్గారామ్‌గోపాల్ బీటెక్ సివిల్ బ్రాంచ్‌లో చదివాడు. గత ఏడాది ఇంజినీరింగ్ నాలుగేళ్ల కోర్సు పూర్తయింది. నాలుగు సబ్జెక్టులు బ్యాక్‌లాగ్‌గా ఉండిపోయాయి. వారం రోజుల క్రితమే హైదారాబాద్‌లో ప్రైవేట్ జాబ్‌లో చేరాడు. ఈ లోగా బ్యాక్‌లాగ్ పరీక్షలకు నోటిఫికేషన్ రావడంతో ఈ నెల 14వ తేదీ నుంచి జరగనున్న పరీక్షల కోసం సన్నద్ధం అయ్యేందుకు తిరిగి ఇంటికి చేరుకున్నాడు. దుర్గారామ్‌గోపాల్ వలసపాకల గ్రామంలోని ఓయో అద్దె గదిని ఆదివారం ఉదయం తీసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫోన్ ఆన్సర్ చేయకపోవడంతో రాత్రి వరకు ఆరా తీసీ ఓయో గదుల బయట అతని మోటార్ సైకిల్‌ను గుర్తించి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. సోమవారం ఉదయం సర్పవరం పోలీసులు, కుటుంబ సభ్యులు వలసపాకలలోని కృష్ణుడి గుడి సమీపం వద్ద ఓయో రూమ్ తలుపులు తెరిచారు. ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. రెండు రోజులుగా ఇంటి వద్ద ఉన్న రామ్‌గోపాల్ బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్‌లు ఉండిపోవడంతో వాటి గురించే ఆలోచించేవాడని అతని అక్క మంజూష తెలిపింది. ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో ఆమె ఫోన్ చేసింది. సాయంత్రం నాలుగు గంటల వరకు రింగ్ అయ్యి ఆగిపోయిందని, తరువాత శవమై కనిపించాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఘటనాస్థలాన్ని ఏఎస్సై నాగేశ్వరావు, సిబ్బంది పరిశీలించి మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మంజూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సీఐ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

- 54 సెల్‌ఫోన్లు, 9 బైక్‌లు స్వాధీనం
- వీటి విలువ రూ.13.52 లక్షలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను చూపుతున్న సీఐ కిషోర్‌బాబు

ప్రత్తిపాడు: రైళ్లలో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లతో పాటు బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 54 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లను, 9 మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన బోధల సురేష్, కాకినాడ జిల్లా తుని రూరల్ మండలం కొలిమేరు గ్రామానికి చెందిన బొందల అప్పారావు అన్నవరంలో ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వీరు సామర్లకోట, అన్నవరం, తుని, పిఠాపురంలో ప్రయాణికుల మాదిరి రైళ్లు ఎక్కుతారు. రాత్రివేళ రైళ్లలో సెల్‌ఫోన్లు చార్జింగ్‌లో పెట్టి నిద్రపోయే వారి నుంచి చాకచక్యంగా చార్జర్‌తో పాటు ఫోన్లను దొంగతనం చేస్తున్నారు. యూట్యూబ్ ద్వారా ఈ ఫోన్ల లాక్‌లను తొలగించి, అపరిచితులకు తక్కువ రేట్లకు విక్రయించి, జల్సాలు చేయడం వీరి నైజం. బస్, రైల్వే స్టేషన్లు, తదితర ప్రాంతాల్లో బైక్‌ల చోరీకి పాల్పడుతున్నారు. వీరిద్దరినీ అన్నవరంలో ఆది, సోమవారాల్లో అదుపులోకి తీసుకున్నారు. బోధల సురేష్ నుంచి ఎనిమిది మోటారు సైకిళ్లు, 48 సెల్‌ఫోన్లను, బొందల అప్పారావు నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 13.52 లక్షలు ఉంటుందని సీఐ కిషోర్‌బాబు తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఎస్సైలు కె.సుధాకర్, జి.సతీష్, ఏఎస్సై శ్రీనివాస్, హెచ్‌సీ గోవిందు, పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

శంఖవరం: విద్యార్థి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే..శంఖవరం మండలం కత్తిపూడి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థి మనరపు చరణ్‌తేజ అదే గ్రామ జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన ఈ విద్యార్థి ఈ నెల 3న స్కూలు నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పరిసర ప్రాంతాలు, విద్యార్థి ఇంటి దగ్గర వెతికినా ఆచూకీ దొరకలేదు. విద్యార్థి స్కైబ్లూ షర్ట్, నేవీ బ్లూ ప్యాంటు గల స్కూలు యూనిఫాం ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసినవారు అన్నవరం పోలీసుస్టేషన్ 9440796571, ప్రత్తిపాడు సీఐ 9440796530 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

హెడ్ మాస్టర్‌ను హత్య చేసినందుకు జీవిత ఖైదు

కాకినాడ లీగల్: జల్సాలకు అలవాటుపడి పథకం ప్రకారం హెడ్ మాస్టర్‌ను హత్య చేసి, దొంగతనం చేసిన కేసులో వ్యక్తికి జీవిత ఖైదు, రూ.2వేల జరిమానా విధిస్తూ కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరి నారాయణ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రూరల్ మండలం వెలమల తూరంగి గ్రామంలో పట్నాల వెంకటరావు నివసించేవారు. ఆయన రేపూరు గ్రామంలో ఎంపీపీ యూపీ స్కూల్‌లో హెడ్ మాస్టర్‌గా విధులు నిర్వహించేవారు. 2019 సెప్టెంబర్ 14 తేదీన ఆయన కుటుంబ సభ్యులు ఊర్లో లేకపోవడంతో గమనించి పథకం ప్రకారం రేపూరు గ్రామానికి చెందిన ఇసుకపాటి ఏసురాజు..మరో ముగ్గురు మైనర్లతో కలిసి ఇంటి వెనుక డోరు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. రాత్రి ఇంటిలో నిద్రిస్తుండగా హెడ్ మాస్టర్‌పై ఏసురాజుతోపాటు ముగ్గురు మైనర్లు కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఇంట్లో ఉన్న రెండు సెల్‌ఫోన్లు, నగదును దొంగిలించారు. మృతుని కుమార్తె ఖండవల్లి సత్య సూర్యరామ దీపిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఇంద్రపాలెం ఎస్సై మురళీకృష్ణ కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో ఏసురాజుపై నేరం రుజువుకావడంతో హత్య చేసినందుకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా, దొంగతనం చేసినందుకు మూడేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రెండు శిక్షలూ ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై.ప్రశాంతికుమారి ప్రాసిక్యూషన్ నిర్వహించారు. ఈ హత్య కేసులో ఇసుకపాటి ఏసురాజుకు శిక్ష విధించారు. ముగ్గురు మైనర్లపై రాజమహేంద్రవరం జువైనల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది.

రేషన్ బియ్యం, పంచదార సీజ్


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం, పంచదార బస్తాలు

తుని రూరల్: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం, పంచదారను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్ అధికారులు సీజ్ చేశారు. సోమవారం అందిన సమాచారం మేరకు తుని మండలం రేఖవానిపాలెం శివారు ఖాళీ స్థలంలో తరలించేందుకు లారీలో ఉంచిన 16 బస్తాల్లోని 800 కిలోల బియ్యం, అరకేజీ చొప్పున ఉన్న 300 పంచదార ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ పి.వి.రవికుమార్ ఆదేశాలతో ఆకస్మిక దాడి చేసినట్టు తుని మండలం పౌరసరఫరాల అధికారి కె.పుణ్యవతి తెలిపారు. 6ఏ కేసు నమోదు చేసి బియ్యం, పంచదారను అదే గ్రామంలో ఉన్న ఎఫ్‌సీఐ గొడౌన్‌కు అప్పగించామని చెప్పారు. సరకును తరలిస్తున్న బొట్టా గోవిందరావుకు చెందిన లారీని సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించినట్టు ఎంఎస్‌ఓ వివరించారు.

వివాహిత మృతిపై కేసు

రాయవరం: మండలంలోని చెల్లూరుకు చెందిన వివాహిత ఉరివేసుకుని మృతి చెందిన ఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై పీవీఎస్ఎస్ సురేష్ తెలిపారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన దుర్గాలక్ష్మి(23)ని ఎనిమిదేళ్ల క్రితం చెల్లూరుకు చెందిన సుబ్బారావుకు ఇచ్చి వివాహం చేశారు. సంతానం కలగని కారణంగా దుర్గాలక్ష్మి మానసిక వ్యథకు గురయింది. ఇదే విషయాన్ని ఆమె తల్లి పెదపూడి పార్వతికి చెప్పి బాధపడింది. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో దుర్గాలక్ష్మి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయింది. ఈ మేరకు పెదపూడి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో ఉన్న పలు రసాయనిక ఎరువుల దుకాణాలను కరప వ్యవసాయ శాఖ ఏడీఏ కె. బాబూరావు ఆధ్వర్యంలో అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఫారం ఓ లేని రూ.81,600 విలువైన 68 బస్తాల డీఏపీ అమ్మకాలను నిలుపుదల చేశారు. కరప వ్యవసాయ శాఖ ఏడీఏ కె.బాబూరావు మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని గొల్లప్రోలు సొసైటీకి 20 టన్నులు, ఎరువుల షాపులకు 120 టన్నులు, కొన్ని రైతు భరోసా కేంద్రాలకు 52 టన్నుల సరకు వచ్చిందన్నారు. మిగిలిన రైతు భరోసా కేంద్రాలకు యూరియా సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. పిఠాపురం హబ్ మేనేజర్ డి. సంజీవ్ కుమార్, మండల వ్యవసాయ శాఖాధికారి కెవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


చిట్టెమ్మ (ఫైల్)

రాయవరం: మండలంలోని చెల్లూరుకు చెందిన శతాధిక వృద్ధురాలు గాజుల చిట్టెమ్మ(104) సోమవారం మృతి చెందింది. ఈ విషయాన్ని చిట్టెమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు. చిట్టెమ్మకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుల్లో ఇద్దరు కొన్నేళ్ల క్రితం మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది.

వివాహిత అదృశ్యం


వీరవెంకట గంగాభవాని (ఫైల్)

రాయవరం: చెల్లూరు గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్సై పీవీఎస్ఎన్ సురేష్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డి వీరరాఘవులు భార్య వీరవెంకటగంగాభవానితో కలిసి ఉద్యోగం నిమిత్తం తణుకులో నివాసం ఉంటున్నాడు. ఈ నెల ఒకటో తేదీన గంగాభవాని దివ్యాంగ పింఛను తీసుకునే నిమిత్తం చెల్లూరు గ్రామానికి వచ్చింది. వలంటీర్ వద్ద పింఛను తీసుకొని తిరిగి తణుకు బయలుదేరింది. ఆమె ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండాపోవడంతో రాయవరం పోలీసులను ఆశ్రయించారు. వీరరాఘవులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేష్ తెలిపారు.